క్లుప్తంగా

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలేటి పల్లె కొత్తపేట సమీపంలోని గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు జరగకుండా ఆలయ చైర్మన్ విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు.

వేమన పద్యాల జ్ఞానం తెలియజేయాలి

పోరుమామిళ్ల: వేమన గొప్పతాత్వికుడని, త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన నిగూఢ తత్వార్థ బోధినిలో 110 వేమన పద్యాలకు ఆధ్యాత్మిక వివరణ రాశారని త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి అధ్యక్షులు రమేష్ పేర్కొన్నారు. ఆదివారం యోగి వేమన జయంతిని పురష్కరించుకొని పోరుమామిళ్లలో సేవాసమితి సభ్యులు వేమన గ్రంధాల ప్రచారం నిర్వహించారు. వేమన జ్ఞానం ప్రజల్లోకి గొప్పగా తీసుకెళ్లేందుకు ఇందూ జ్ఞాన వేదిక, ప్రబోధ సేవాసమితి కృషి చేస్తుందన్నారు. పోరుమామిళ్లలో సేవాసమితి సభ్యులు శివ, సుభాషిణి, లక్ష్మిదేవి, వెంకటేష్, నారాయణ తదితరులు వేమన పద్యాల వివరణ కలిగిన త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంధాల ప్రచారం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో భగవద్గీత పారాయణం

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక వెంకటేశ్వర్లపేటలోని శ్రీజగద్గురు వేదాంతం లక్షణార్యుల 82వ వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం సంపూర్ణ భగవద్గీతా పారాయణం చేశారు. శ్రీకాళహస్తికి చెందిన శ్రీరామ చైతన్య స్వామి స్కందోపనిషత్ పై ప్రవచనాలు చేశారు. గీతా పారాయణ ప్రాముఖ్యతను, భగవద్గీత గొప్పదనాన్ని వివరించారు. సాధు పద్మ భూషణ్ చిత్రించిన వేదాంతం లక్ష్మణార్యుల చిత్రపటాలను ఈ సందర్భంగా పలువురు అతిధులు ఆవిష్కరించారు. ఆశ్రమ అధ్యక్షుడు వద్ది నరసింహులు, పలు ప్రాంతాలకు చెందిన ఆధ్యాత్మిక ప్రసంగీకులు బ్రహ్మశ్రీ జీఎస్ శాస్త్రీ, లక్ష్మణస్వామి, అనయ్య తీర్థులు, యోగానంద, సుబ్బమ్మ, రామసుబ్బమ్మ, ఉమా సుదర్శన్, విజయమ్మ, ఆశ్రమ నిర్వాహకులు, వేదాంతం లక్ష్మణార్యుల శిష్యులు పాల్గొన్నారు.

సెలవు రోజూ కులగణన సర్వే

గోపవరం : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే సెలవు రోజు ఆదివారం కూడా మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో నిర్వహించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి కులగణన సర్వేను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. క్లస్టర్ల వారీగా సచివాలయ సిబ్బందిని కులగణన సర్వేకు పర్యవేక్షకులుగా నియమించడంతో వలంటీర్లతో పాటు సచివాలయ సిబ్బంది కూడా విధులు నిర్వహించారు. ఈఓపీఆర్డీ హసీనా అన్ని సచివాలయాల్లో జరుగుతున్న కులగణన సర్వేను పర్యవేక్షించారు. ఈ నెల 28వ తేదీ ప్రభుత్వం తుది గడువు ఇవ్వడంతో సర్వే ముమ్మరంగా కొనసాగుతుంది. ఈ నెల 19 నుండి మొదలైన సర్వే ఇప్పటి వరకు దాదాపు మండల వ్యాప్తంగా 40 శాతంపైగా పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. గ్రామ పంచాయతీల డీడీఓలు విజయ కుమార్, శ్రీనివాసులరెడ్డి, మోశ, వెంకట సుబ్బయ్యలు గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను పర్యవేక్షిస్తూ వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్నారు.

25న మండల సర్వసభ్య సమావేశం

చాపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో ఈ నెల 25న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి శ్రీధర్‌నాయుడు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి హాజరుకానున్నారని, ఈ సందర్భంగా అన్ని శాఖలకు చెందిన అధికారులతో పాటు ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

ఘనంగా మండల పూజ

లింగాల : మండలంలోని లోపట్నూతల గ్రామంలో 41 రోజుల క్రితం మారెమ్మ, మాలే గంగమ్మల ఆలయాలను ప్రారంభించారు. ఆలయాలను ప్రారంభించి మండలం కావడంతో ఆయా ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ మండల పూజ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్సీపీ మండల ఇన్‌చార్జి వైఎస్ అభిషేక్‌రెడ్డిలు పాల్గొని పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందుకున్నారు. గ్రామప్రజలు అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకుడు అలవలపాటి నాగ భూషణ్‌రెడ్డి విందు భోజనాలను ఏర్పాటు చేశారు. మండల వైఎస్సార్సీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, బాబురెడ్డి, లింగాల మండల యూత్ కన్వీనర్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్సీపీ కడప పార్లమెంటరీ కన్వీనర్లు సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహామండలి కమిటీ చైర్మన్ రమేష్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ నాగేంద్రనాథరెడ్డి, రాష్ట్ర బీసీ సంఘ డైరెక్టర్లు నారాయణ, కాటేశ్వర, మండలంలోని వివిధ గ్రామాల వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ

మైదుకూరు: బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని ఆదివారం మైదుకూరులో జై శ్రీ రామ్ నినాదాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్, సమరసత సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని నాలుగు రోడ్ల లో బైక్ ర్యాలీ నిర్వహించారు.

కామ్రేడ్ లెనిన్ స్ఫూర్తితో పోరాటం



నగరంలో లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : లెనిన్ స్ఫూర్తితో కార్మిక హక్కుల కోసం, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం సాగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఓబులేసు అన్నారు. ఆదివారం లెనిన్ 100వ వర్ధంతి సందర్భంగా నగరంలోని జిల్లా పరిషత్ హాల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగసుబ్బారెడ్డి, బషీరున్నిషా, విజయలక్ష్మి, సుబ్రమణ్యం, వెంకటశివ, కేసీ బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

రష్యా దేశపు కార్మిక వర్గాన్ని, రైతాంగాన్ని చైతన్య పరిచి నిరంకుశ రాచరిక జార్ చక్రవర్తి ప్రభుత్వాన్ని కూలదోసి, ప్రపంచంలోనే మొదటి సారిగా కార్మిక రాజ్యాన్ని ఏర్పరిచి, సోషలిస్టు వ్యవస్థ నిర్మాణానికి పునాదులు వేసిన కామ్రేడ్ లెనిన్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో లెనిన్ శత వర్ధంతి సభ నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐ.ఎన్.సుబ్బమ్మ, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాసులురెడ్డి, రామ్మోహన్, బి.దస్తగిరిరెడ్డి, వి.అన్వేష్, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌సీపీ ఆధ్వర్యంలో ..

ఎన్నేళ్లు అయినా మరిచిపోని విప్లవకారుడు, కార్మిక రాజ్య స్థాపకుడు లెనిన్ అని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి తెలిపారు. కాగితాల పెంటలోని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యాలయంలో లెనిన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మీదేవి, చాంద్ బేగం, రవి, అజయ్, లోకేశ్వర్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, గంగన్న, కాశీం, పెంచలయ్య, చిన్నోడు, మునేంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో..

కడప ఎడ్యుకేషన్ : లెనిన్ విప్లవ స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శనీయం అని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న అన్నారు. కడపలోని పీడీఎస్‌యూ రాయలసీమ ప్రాంత కార్యాలయంలో కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతిని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా కార్యదర్శి శ్రీనాథ్‌యాదవ్, నగర కార్యదర్శి గణేష్, నాయకుడు చోటుల్లా తదితరులు పాల్గొన్నారు.

- నగరంలో లెనిన్ చిత్రపటానికి కొండా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కొండా సుబ్బయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్కే సేవా సమితి అధ్యక్షుడు రాయల్ కరీముల్లా, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అన్వేష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సత్కారం



అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న సాహితీవేత్తలు, ప్రముఖులు

కడప కల్చరల్ : తమ రంగంలో విశేష ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి అవార్డులు అందుకున్న ఇద్దరు జిల్లా ప్రముఖులకు సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం ఘన సత్కారం జరిగింది. వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి రచించిన రాయలసీమ నాటక వికాసం గ్రంథానికి ఇటీవల రాష్ట్ర నంది అవార్డు లభించింది. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిగా ప్రశంసనీయ సేవలు అందించిన డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణిని అవార్డు వరించింది. వీరికి ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రముఖ కథా రచయిత షేక్ హుసేన్ సత్యాగ్ని మాట్లాడారు. జిల్లా వాసులకు రాష్ట్ర స్థాయి పురస్కారాలు లభించడం ప్రశంసనీయమన్నారు. ప్రతిష్టాత్మక నంది పురస్కారం పొందిన మూల మల్లికార్జునరెడ్డి రాయలసీమ నాటక చరిత్రలో చిరస్మరణీయమైన స్థానం సంపాదించారన్నారు. సాహిత్య, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న తెలుగు అధ్యాపకురాలు నీలవేణికి ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా అవార్డు రావడం సంతోషదాయకమన్నారు. అనంతరం వైఎస్సార్ జిల్లా రచయితల మహాసభల్లో కీలకపాత్ర పోషించి విజయవంతం చేసిన షేక్ హుసేన్ సత్యాగ్ని దంపతులు, సంఘం గౌరవ సలహాదారులు అలపర్తి పిచ్చయ్యచౌదరిని సత్కరించారు. కార్యక్రమంలో కవిత విద్యా సాంస్కృతిక సంస్థ చైర్మన్ అలపర్తి పిచ్చయ్యచౌదరి, స్థానిక ప్రముఖులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, భూమిరెడ్డి స్వరూపరాణి, డాక్టర్ కొప్పోలు రెడ్డిశేఖర్‌రెడ్డి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, జింకా సుబ్రమణ్యం, డాక్టర్ జీవీ సాయిప్రసాద్, డాక్టర్ అనుగూరి చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, డాక్టర్ ఎస్.రాజగోపాల్‌రెడ్డి, డాక్టర్ తవ్వా వెంకటయ్య, డాక్టర్ కోడూరు స్వతంత్ర్య బాబు తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో ‘సండే’ సందడి



శిల్పారామంలో విద్యార్థుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా స్థానిక వర్షిణి డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు తమ నృత్యాలతో అలరించారు. ఇటీవల విస్తృత ప్రచారంలో ఉన్న సినిమా పాటలతోపాటు జానపద గీతాలకు కూడా వారు హుషారు గొలిపే నృత్యాలతో ఆకట్టుకున్నారు. సందర్శకులు అడుగడుగునా ప్రోత్సహిస్తూ కరతాళ ధ్వనులు చేశారు. శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చెన్నూరు : మండలంలోని చిన్నమాచుపల్లె గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి దళితవాడ వరకు రూ.14 లక్షలతో జనరల్ నిధుల ద్వారా సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నమాచుపల్లె గ్రామ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తానని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామాలలో లక్షలాది రూపాయలతో డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమ పాలనలో కుల మతాలకు అతీతంగా, పార్టీలకు అతీతంగా అటు సంక్షేమం ఇటు అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా నేడు అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి సంక్షేమ పథకాలు ఎలాంటి పక్షపాతం లేకుండా, నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోనే జమచేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బుజిరెడ్డి, సుబ్బారావు, మోహన్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, శివ, చంటి, శ్రీనివాసులు, పుల్లారెడ్డి, బాలసుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం నిర్వహించే వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి హాజరవుతున్నారని ఆ పార్టీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పేద బ్రాహ్మణ విద్యార్థుల సంక్షేమానికి కృషి



నరేంద్రను సన్మానిస్తున్న బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

ప్రొద్దుటూరు కల్చరల్: పేద బ్రాహ్మణ విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని హైదరాబాదుకు చెందిన ప్రణీత్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ ప్రణీత్ నరేంద్ర పేర్కొన్నారు. స్థానిక కొత్తరాఘవేంద్రస్వామి ఆలయ సమీపంలోని బ్రాహ్మణ సేవా సంఘం భవనంలో ఆదివారం బ్రాహ్మణ చైతన్య సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, మెడిసిన్ చదువుతున్న పేద బ్రాహ్మణ విద్యార్థుల ఉన్నత విద్యకు, కోచింగ్ ఫీజుతోపాటు, హాస్టల్ వసతి కల్పిస్తానన్నారు. బ్రాహ్మణ నిరుద్యోగుల స్వయం ఉపాధికి తనవంతు తోడ్పాటు అందిస్తానన్నారు. రాజకీయ నాయకుడు కాశీభట్ల సత్యసాయినాథశర్మ మాట్లాడారు. బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కంబగిరిరావు, బ్రాహ్మణ ప్రముఖులు, అర్చకులు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్రంలోని ఇంటర్, డిగ్రీ కళాశాలల అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ద్రవిడ సురేష్ కోరారు. ఆదివారం ఈ మేరకు ఉపాధ్యాయ శాసన మండలి సభ్యుడు ఎంవీ రామచంద్రారెడ్డిని ఏఐవైఎఫ్ నాయకులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్మీడియెట్, డిగ్రీ కళాశాలల్లో ఒప్పంద అధ్యాపకులు ఉన్నప్పటికీ.. అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర సహాయ కార్యదర్శి బి.సంజీవ్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

నేడు పట్టాభిషేకం

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో సోమవారం సీతారాముల పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్యసభ అధ్యక్షకార్యదర్శులు బుశెట్టి రామ్మోహనరావు, మురికి సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. దేవతామూర్తులను విశేష అభిషేకాలు, అర్చనలతో పాటు ప్రత్యేక అలంకరణతో పాటు సీతారాముల పట్టాభిషేకం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అయోధ్య నుంచి వచ్చిన కంకణాలను పాల్గొన్న భక్తులకు అందిస్తామని పేర్కొన్నారు.

- స్థానిక శ్రీ ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం 108 మహిళలతో కోదండరామ స్వామి ఆలయం నుంచి శోభాయాత్ర, 108 కలశాల గంగాజలంతో కోదండరామస్వామికి అభిషేకం, హనుమాన్ చాలీసా పారాయణం, భగవద్గీత పారాయణం చేయనున్నారు. ఆలయంలలో అయోధ్య ప్రాణ ప్రతిష్ఠను ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వినియోగం ఉంటుందని వివరించారు.

గడ్డివాముల దగ్ధం

పెద్దముడియం : పెద్దపసుపుల గ్రామంలో ఆదివారం రాత్రి యేమిరెడ్డి సంజీవరెడ్డికి చెందిన రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. ప్రమాదవశాత్తు మినుము, వరి గడ్డివాములకు మంటలు చెలరేగడంతో ఫైర్ సిబ్బంది వెంటనే వచ్చి మంటలను అదుపు చేయడంతో పక్కనే పదుల సంఖ్యలో ఉన్న గడ్డివాముల రైతులు ఊపిరి పీల్చుకున్నారు. గడ్డివాములు విలువ రూ.60 వేలు ఉంటుందని భాదిత రైతు తెలిపారు.

మహాసభలను విజయవంతం చేయాలి

వేంపల్లి : భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 28, 29 తేదీల్లో ప్రొద్దుటూరులో జరిగే జిల్లా 5వ మహాసభలను విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి చల్లా బాలాజీ, ఉపాధ్యక్షుడు దస్తగిరిలు పిలుపునిచ్చారు. ఆదివారం వేంపల్లిలో మహాసభలకు చెందిన కరపత్రాలను వారు విడుదల చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు

వల్లూరు : మండల పరిధిలో మంగళవారం నుంచి వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ డేనియల్ జోసెఫ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వల్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఓల్టేజీని దృష్టిలో వుంచుకుని విద్యుత్ సరఫరాలో మార్పులు చేస్తున్నట్లు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పెద్దపుత్త, గోటూరు, చెరువు కిందిపల్లె వ్యవసాయ ఫీడర్లకు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వ్యవసాయ మోటార్లకు త్రీ ఫేజ్ విద్యుత్‌ను సరఫరా చేస్తామని తెలిపారు. కాగా మండలంలోని పైడికాలువ సబ్‌స్టేషన్ పరిధిలో ప్రస్తుతం అమలులో వున్న వేళల ప్రకారం విద్యుత్ సరఫరా కొనసాగుతుందన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

పూర్వ ఉద్యోగుల సమ్మేళనం

పులివెందుల రూరల్ : పట్టణంలోని సీఎస్ఐ చర్చి ఆవరణలో నూతనంగా నిర్మించిన వైఎస్ రాజమ్మ, వైఎస్ చిన్నకొండారెడ్డి మెమోరియల్ ఫంక్షన్ హాల్‌లో సరస్వతి ఆస్‌బెస్టాస్ మైనింగ్‌లో చేసిన ఉద్యోగస్తులు, కార్మికులతో కలిసి పూర్వ ఉద్యోగస్తుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సమావేశాన్ని పారిశ్రామికవేత్త వైఎస్ ప్రకాష్‌రెడ్డి సతీమణి పద్మావతమ్మల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి వైఎస్ సోదరులు వైఎస్ ప్రతాప్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ జోసఫ్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్ ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ మైనింగ్‌లో పనిచేస్తున్నటువంటి ఉద్యోగస్తులు కార్మికులతోనే మైన్సుల అభివృద్ధి చెందాయన్నారు. కలిసికట్టుగా అందరూ కష్టపడి పనిచేయాలన్నారు. సరస్వతి మైన్స్‌లో పనిచేసిన పూర్వ ఉద్యోగస్తులందరితో కలిసి మాట్లాడుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఉద్యోగస్తులకు కార్మికులు దుశ్శాలువాలు కప్పి సన్మానించారు. కార్మికులకు, ఉద్యోగస్తులందరికి బహుమతులను ప్రధానం చేశారు. అనంతరం పూర్వ ఉద్యోగస్తులు, కార్మికులు అందరు కలిసి భోజనం చేసి అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో తొండూరు మండల వైఎస్సార్సీపీ మండల ఇన్‌చార్జి వైస్ మధురెడ్డి, ఉద్యోగస్తులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు పల్లవోలులో జగనన్న ఆరోగ్య సురక్ష

చాపాడు: మండలంలోని పల్లవోలు గ్రామంలోని గ్రామ సచివాలయ భవన సముదాయం వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహించే శిబిరంలో ఐదుగురు ప్రత్యేక వైద్య నిపుణులతో అన్ని రకాలైన వైద్య పరీక్షలు జరుగుతాయన్నారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

నాస్తిక మేళాను జయప్రదం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని చార్వాక ఆశ్రమంలో ఫిబ్రవరి 11, 12 తేదీల్లో జరిగే 32వ జాతీయ నాస్తిక మేళాను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఓబులేసు, జిల్లా సీపీఐ కార్యదర్శి గాలి చంద్ర కోరారు. ఆదివారం నగరంలోని జిల్లా పరిషత్ హాల్ ఆవరణలో చార్వాక ఆశ్రమం క్యాలెండర్, నాస్తిక మేళా కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ పాలకులు మనుధర్మం ప్రచారం చేసే అసమానతలు, అన్యాయాలను నేటి రాజ్యాంగం స్థానంలో ప్రతిష్టించాలని ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మేడే, అక్టోబర్ విప్లవం లాంటి వాటికి తోడుగా దేశీయ సంస్కృతిలో భాగంగా నాస్తిక మేళాను ఆచరణలో పెడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారత నాస్తిక సమాజం రాష్ట్ర నాయకులు పల్లవోలు రమణ, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి చిన్నం పెంచలయ్య, రాష్ట్ర నాయకులు సుబ్బు, గురప్ప, సూరి, సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ, బాదుల్లా, రైతు సంఘం కడప జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, సావంత్ సుధాకర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు వలరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



డైరీలు ఆవిష్కరిస్తున్న ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు

కడప కార్పొరేషన్ : విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆ యూనియన్ ఆధ్వర్యంలో 2024 సంవత్సర క్యాలెండర్, డైరీల ఆవిష్కరణ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు, ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలపై చర్చించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బండి రామలింగారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, రెగ్యులర్ ఉద్యోగులకు పింఛన్ సౌకర్యం కల్పించాలన్నారు. కారుణ్య నియామకాలను పాత పద్ధతిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బాలకాశి, 1104 యూనియన్ నాయకులు ఎస్.క్రిష్టయ్య, ఎంపీ రమణ, ఐఎన్‌టీయూసీ నాయకులు రాఘవరెడ్డి, ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు మల్లికార్జునరెడ్డి, మంజునాథ్, కె.బ్రహ్మానందరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలి



హజ్ కమిటీ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న రూట నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న డీఎస్సీలో ఉర్దూ మీడియం ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయ ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని రూట నాయకులు కోరారు. ఈ విషయమై ఆదివారం రూట రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ హిదయతుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి అసదుల్లాబాషా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌసల్ ఆజాంను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉర్దూ మీడియానికి తగినంత మంది ఉపాధ్యాయులు లేక విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. వేల సంఖ్యలో అభ్యర్థులు ఉర్దూ మీడియం డీఈడీ, బీఈడీలు పూర్తి చేసి డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసి ఖాళీలు భర్తీ చేయాలన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హజ్ కమిటీ చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రూట డైరీ కమిటీ చైర్మన్ హాజీ అబ్దుల్ హకీమ్, రాష్ట్ర నాయకులు సత్తార్ ఫైజీ, సిరాజుద్దీన్, మహమ్మద్ అయిబ్, జుబేర్ అహ్మద్, యునుస్ తయిబ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన



నగర సంకీర్తనలో పాల్గొన్న మారుతి ప్రసాద్, భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక మెయిన్‌బజారు రోడ్డులోని శ్రీ ఆత్మారామస్వామి ఆలయంలో అయోధ్య శ్రీరామ ప్రతిష్ఠ సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున ఆలయ ప్రధానార్చకుడు వంకా దుర్గాప్రసాద్‌శర్మ సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తులతో పురవీధుల్లో నగర సంకీర్తన చేశారు. భక్తులు శ్రీరామనామం జపిస్తూ, భక్తి గీతాలు ఆలపించారు. మహిళల కోలాటం, శ్రీరామ లక్ష్మణ ఆంజనేయస్వామి వేషధారణలు అందరిని ఆకట్టుకున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యుడు టంగుటూరి మారుతి ప్రసాద్, ఆలయ ప్రెసిడెంట్ పెద్దరామయ్య, సెక్రటరి రామాంజనేయులు, ట్రెజరర్ నాగరాజు, మేనేజర్ రఘువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సగర కులస్తులు ఆర్థికంగా ఎదగాలి

ప్రొద్దుటూరు క్రైం : సగర కులస్తులు ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఎర్రగుంట్ల రోడ్డులోని రెడ్ల కల్యాణమండపంలో ఆదివారం సగర కుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏడాది క్రితం సగర సోదరులతో సమావేశం అయినప్పుడు కల్యాణ మండపం నిర్మించుకునేందుకు స్థలం కావాలని అడిగారన్నారు. స్థలం తీసుకుంటే అందుకు కావాల్సిన డబ్బు ఇస్తానని నాడు మాట ఇచ్చినట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఈ మేరకు సగర సంఘానికి చెందిన పెద్ద మనుషులు కల్యాణ మండపం కోసం 1.25 స్థలం తీసుకున్నారన్నారు. అందుకు కావలసిన రూ. 75 లక్షలను వారికి అందజేశానన్నారు. తాను ఇచ్చిన హామీని హామీ నిలబెట్టుకున్నందుకు ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఉప్పర కులస్తుల్లో ఆర్థిక స్థోమత ఉన్న 70–80 మంది చందాలు వేసుకొని రూ. 2 కోట్లు లేదా రూ.2.50 కోట్లతో కల్యాణ మండపాన్ని నిర్మించుకోవచ్చని ఎమ్మెల్యే సూచించారు. సగరుల ఆనందం, అభివృద్ధే తాను కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి, సగర కడప జిల్లా అధ్యక్షుడు మజ్జారి వీరమోహన్, రాష్ట్ర సగర కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పర మురళీ, రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు నీలం బాలగంగాధర్ తిలక్, జిల్లా కోశాధికారి విశ్వప్రసాద్, మాదాసు రాము, సగర కులస్తులు బంది కిశోర్, సీతంపల్లె రవి, జగతి వెంకట సుబ్బయ్య, జగతి జగన్, మాకం శ్రీరాములు, లక్ష్మీనారాయణ, పేట వెంకటరమణ, మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.